సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

● ఎమ్మెల్యే రోహిత్

చిక్కడపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థలు, ట్రస్టులు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం మంచి పరిణామం అని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ట్రస్టును స్థాపించి ప్రజలకు సేవలందిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మైనంపల్లి ట్రస్ట్ చైర్మన్ బద్దం మోహన్‌రెడ్డిని గాంధీనగర్‌లో జరిగిన సంక్రాంతి పండుగ కార్యక్రమంలో సన్మానించారు.

కనులపండువగా కరినోము ఉత్సవం


భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న ఆలయ నిర్వాహకులు

చిక్కడపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో కనుమ పండుగను పురస్కరించుకుని గోదా అమ్మవారి కరినోము ఉత్సవం కనులపండువగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఉచితంగా ప్రసాదం అందజేశారు. ఈవో రామాంజనేయులు, వ్యవస్థాపక వంశీయుడు శ్రీనాథ్‌గౌడ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా

రేపు రక్తదానం, దుప్పట్ల పంపిణీ

రాంనగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పలు సేవా కర్యక్రమాలు నిర్వహిస్తున్నామని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా తెలిపారు. నగర కార్యాలయంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు.

ఈ నెల 18న రాష్ట్ర కార్యాలయంలో రక్తదాన శిబిరం, దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళి, 9.30 గంటలకు ఎన్టీఆర్ అమరజ్యోతి ర్యాలీ రసూల్‌పుర నుంచి, 10 గంటలకు టీడీపీ నగర కార్యాలయంలో నివాళి, 10.30 గంటలకు అశోక్‌నగర్ చౌరస్తా వద్ద నివాళి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలలో గుడిసెల కూల్చివేతపై..

నేడు, రేపు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన

రాంనగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో గుడిసెల కూల్చివేత, అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రజా సంఘాల పోరాట వేదిక అధ్యక్షుడు ఎస్. వీరయ్య అన్నారు. నాన్ బెయిలబుల్ కేసులకు నిరసనగా ఈనెల 17, 18 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గుడిసెవాసులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, అరెస్ట్ చేసిన నాయకులు, గుడిసెవాసులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. నాయకులు జి.నాగయ్య, చుక్క రాములు, సాగర్, పాలడుగు భాస్కర్, భూపాల్, అరుణ జ్యోతి, కోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో కాంగ్రెస్‌దే అధికారం

● పార్టీ సీనియర్ నాయకుల ధీమా

నల్లకుంట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కేపీ మురళీకృష్ణ, కుతాడి రవికుమార్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఏపీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల నియామకంపట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పార్టీ పటిష్ఠత కోసం అంకితభావంతో పనిచేస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బి. వెంకట్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఖరారు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. మంగళవారం హైదర్‌గూడలో వారు విలేకరులతో మాట్లాడారు.

బీజేపీలో మాలలకు అన్యాయం


మాట్లాడుతున్న పి.బల్వంత్‌రావు

నల్లకుంట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో మాల సామాజిక వర్గానికి తీరని అన్యాయం జరిగిందని జై భీమ్ సేన ఫైట్ ఫర్ రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్వంత్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో మాదిగలకు 13 సీట్లు, మాలలకు 6 సీట్లు మాత్రమే కేటాయించిందని విమర్శించారు. మంగళవారం సేన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భవిష్యత్‌లో మాల సామాజిక వర్గానికి పదవులు ఇవ్వకుండా బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. మాలలకు ప్రాధాన్యం ఇవ్వకపోతే త్వరలో జరిగే ఎంపీ ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని ఆయన హెచ్చరించారు.

గుంటూరు కారం సినిమాలో

మార్క్స్, లెనిన్ పేర్లు తొలగించాలి

బర్కత్‌పుర/రాంనగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు కారం సినిమాలో విలన్స్‌కు పెట్టిన మార్క్స్, లెనిన్ పేర్లను తక్షణమే తొలగించాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి అధ్యక్షుడు వలిఉల్లాఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నామాల అజాద్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్, ప్రధాన కార్యదర్శి వి. అజయ్ డిమాండ్ చేశారు. మార్క్సిస్టు మహోపాధ్యాయులు మార్క్స్, లెనిన్ పేర్లను విలన్స్‌కు పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. డైరెక్టర్ త్రివిక్రమ్, హీరో మహేష్‌బాబు బేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పాలని, ఆ పేర్లను తొలగించేలా సెన్సార్ బోర్డు చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

పేదలకు దుస్తుల పంపిణీ

చిక్కడపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా గాంధీనగర్ డివిజన్‌లో పేదలకు మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ దుస్తులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకుడు సాయికీర్త్(బాబ్జీ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు శీలం సత్యనారాయణ, పాశం రవి, అనిల్, సురేష్, జగదీశ్ గుండు, సురేందర్‌రాజు, నరేందర్‌యాదవ్, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని వివరించారు.


దోమలగూడ తాళ్లబస్తీలో పతంగి ఎగురవేస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు జి. వెంకటేష్ తదితరులు


గంగపుత్ర కాలనీలో పతంగులు ఎగురవేస్తూ నృత్యం చేస్తున్న బీజేపీ నాయకుడు ఎం నవీన్‌గౌడ్ తదితరులు


పద్మశాలి కాలనీలో పతంగులు ఎగురవేస్తున్న పద్మశాలి కాలనీ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆర్. ఆంజనేయులు తదితరులు

ఘనంగా సంక్రాంతి

● ఆకాశంలో పతంగుల రెపరెపలు ● యువకుల సందడి ● ఇళ్ల ఎదుట రంగు రంగుల రంగవల్లులు

సంక్రాంతి పండగను ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు, యువకులు, మహిళలు సైతం పతంగులు ఎగురవేస్తూ సందడి చేశారు. రంగురంగుల గాలిపటాలు, యువకుల కేరింతలతో సందడి వాతావరణం నెలకొంది. డీజే పాటలు పెట్టి పతంగులు ఎగురవేస్తూ, నృత్యాలు చేస్తూ ఆనందంగా గడిపారు. పండగ సందర్భంగా మహిళలు ఇళ్ల ఎదుట రంగు రంగుల ముగ్గులు వేశారు. భోలక్‌పూర్ పద్మశాలి కాలనీలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. దోమలగూడ తాళ్లబస్తీలో కార్పొరేటర్ జి. రచనశ్రీ గాలిపటాలు ఎగురవేశారు.

- ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం (ఆంధ్రజ్యోతి)


పతంగులతో యువకులు


నల్లకుంటలో పతంగి ఎగురవేస్తున్న మాజీమంత్రి సి.కృష్ణయాదవ్


ముషీరాబాద్‌లో తన ఇంటి ఎదుట సంక్రాంతి ముగ్గు వేస్తున్న కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్


భోలక్‌పూర్‌లో ముగ్గుల పోటీ విజేత సుజాత


పాత నల్లకుంట డాక్టర్ చారి వీధిలో ముగ్గు వేస్తున్న మహిళలు

వైభవంగా మల్లన్న కల్యాణ మహోత్సవం


ఆలయంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

ముషీరాబాద్/చిక్కడపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బాకారంలో ప్రసిద్ధి గాంచిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి (మల్లన్న) కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, ముఠా జైసింహ, కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్, గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి దంపతులు బోనం తీసుకొచ్చి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. అగ్ని గుండంలో నడుచుట, గొలుసులు తెంపుట తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అశోక్‌నగర్‌కు చెందిన రాంపురం రాజనర్సింగ్‌రావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జోగిని అవిక బోనం సమర్పించారు. ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి మాట్లాడుతూ.. పోలీసులు, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వైశ్రీనివాస్‌రావు, నాయకులు బింగి నవీన్, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, పూస గోరక్‌నాథ్, మాజీ కార్పొరేటర్ ఆర్. కల్పనాయాదవ్, కాంగ్రెస్ నాయకులు ఎల్. శ్రీకాంత్ గౌడ్, మల్లికార్జున్‌రెడ్డి, మేడి సురేష్‌కుమార్, రామానందరెడ్డి, బీజేపీ నాయకుడు ఎ. వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


స్వామి కల్యాణ మహోత్సవంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు


మల్లన్న స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్


బోనం తీసుకెళ్తున్న ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి దంపతులు తదితరులు


పూజల్లో కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ దంపతులు

పేద విద్యార్థులకు చేయూతనందించాలి


విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు చేయూతనందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల వారు ఉన్నత చదువులు చదువుకోలేకపోతున్నారని అన్నారు. మంగళవారం బర్కతపురలో బీజేపీ నగర కార్యాలయంలో స్మార్థ ట్రస్ట్ చైర్మన్ శరత్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు కిషన్‌రెడ్డి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలు పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్ రావు, అధికార ప్రతినిధి ఎడెల్లి అజయ్‌కుమార్, ఏబీవీపీ కార్యదర్శి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జైపాల్‌రెడ్డి కృషి వల్లే మెట్రో మంజూరు

● మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నగరానికి మెట్రో రైలు ప్రాజెక్టు మంజూరు చేయించేందుకు కేంద్ర మాజీ మంత్రి, దివంగత నేత జైపాల్‌రెడ్డి ఎంతో కృషి చేశారని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. జైపాల్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని మంగళవారం నెక్లెస్‌రోడ్డులో స్ఫూర్తిస్థల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. మెట్రో ప్రాజెక్టుకు అప్పటి కేంద్ర మంత్రిగా వయెబులిటీ గ్యాప్ ఫండింగ్‌కు కృషిచేశారని గుర్తుచేశారు. మెట్రో ప్రాజెక్టులకు స్టాండర్డ్ గేజ్ అవసరమని తాను ఇచ్చిన ప్రజెంటేషన్‌కు మార్గనిర్దేశనం చేశారని పేర్కొన్నారు. జైపాల్‌రెడ్డి పట్టుదల కారణంగానే నగరానికి మెట్రో ప్రాజెక్టు మంజూరైందని చెప్పారు.

'మాక్సివిజన్'లో ఆర్మీ సిబ్బందికి ఉచితంగా పరీక్షలు

హైదరాబాద్ సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మాక్సివిజన్ సూపర్ స్పెషాల్టీ కంటి ఆస్పత్రిలో గురువారం నుంచి ఈనెల 31 వరకు ఆర్మీ సిబ్బందికి ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. సోమాజిగూడ, అత్తాపూర్, బేగంపేట, మాదాపూర్, కూకట్‌పల్లి, మదీనగూడ, ఏఎస్‌రావునగర్, దిల్‌సుఖ్‌నగర్, సంతోష్‌నగర్, కొత్తపేట, తార్నాక, వరంగల్, మణికొండ ప్రాంతాల్లోని తమ ఆస్పత్రుల్లో పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు.

జూపార్కులో సందర్శకుల సందడి

మదీన, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ నేపథ్యంలో మంగళవారం పాతబస్తీలో పలు పర్యాటక స్థలాలు సందర్శకులతో కళకళలాడాయి. సుమారు 23 వేల మంది జూ పార్కు సందర్శించారు. సుధా కార్స్ మ్యూజియానికి కూడా పెద్దసంఖ్యలో జనం తరలివచ్చారు.

'జైపాల్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాలి'

రాంనగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి విగ్రహం నగరంలో ఏర్పాటు చేయాలని డీఎస్‌డీ నేషనల్ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈనెల 16 జైపాల్‌రెడ్డి జయంతి, జూలై 28 వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించాలని, జైపాల్ రెడ్డి పేరుతో ప్రత్యేక సంక్షేమ పథకం ప్రవేశపెట్టాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

తల్లీపిల్లల అదృశ్యం


అదృశ్యమైన తల్లీపిల్లలు

బర్కత్‌పుర, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైంది. చిక్కడపల్లికి చెందిన సునీత(39)కు సాయికృష్ణతో వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు మౌనిష్(7), త్రిలోచన్(9), చైత్ర(11). సునీత భర్తతో గొడవపడి గతంలో పుట్టింటికి వెళ్లగా తల్లిదండ్రులు సర్దిచెప్పి పంపించారు. మళ్లీ గొడవపడి గాంధీనగర్ లంకలో ఉంటున్న తమ్ముడి ఇంటికి వెళ్లింది. ఈనెల 9వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా పిల్లలను తీసుకొని కనిపించకుండా పోయింది. వారి ఆచూకీ లభించకపోవడంతో సోదరుడు వినయ్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అతిగా మద్యం తాగి ప్రైవేట్ ఉద్యోగి మృతి

బర్కత్‌పుర, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగి ఓ వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన మహిపాల్‌రెడ్డి(45) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరులో ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగరీత్యా నగరానికి వచ్చాడు. లింగంపల్లి చౌరస్తా వద్ద వైన్‌షాపులో అతిగా మద్యం తాగి కాచిగూడ చప్పల్‌బజార్ ఎస్‌వీఎస్ ఆస్పత్రి ఎదుట రోడ్డుపై పడిపోయాడు. అపస్మారక స్థితికి చేరుకొని చనిపోయాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.





జైపాల్‌రెడ్డికి నివాళి

కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ జైపాల్ రెడ్డికి పలువురు నివాళులర్పించారు. మంగళవారం ఆయన సమాధిపై తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి, దైవజ్ఞ శర్మ, వీహెచ్, జైపాల్ రెడ్డి అభిమానులు పూలమాలలు వేశారు.

- కవాడిగూడ, ఆంధ్రజ్యోతి



హరీష్‌ను కలిసిన ఎమ్మెల్యే

సంక్రాంతి పండగ సందర్భంగా మాజీ మంత్రులు తన్నీరు హరీష్‌రావు, జగదీశ్వర్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఆయన సతీమణి, మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ తదితరులు

- బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

వైద్యుడికి పురస్కారం



పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తూ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ ఎం. శ్రీనివాసరావుకు సంక్రాంతి సందర్భంగా ప్రముఖ కళా సంస్థ ది మ్యూజిక్ గ్రూప్ పురస్కారం ప్రకటించింది. గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు.

- గోల్నాక, ఆంధ్రజ్యోతి



సన్మానం

మాజీ కార్పొరేటర్, వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డిని యూనియన్ సభ్యులు మంగళవారం సత్కరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి అయిలి ప్రభాకర్, ఆఫీస్ బేరర్ రవియాదవ్, నరేందర్ గౌడ్, రణధీర్‌రెడ్డి, మధు, సత్యనారాయణ, మల్లేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి